నేడు మాల మహర్ సర్వసభ్య సమావేశం

చిక్కడపల్లి: మాల మహర్ నేషనల్ జేఏసీ సర్వ సభ్య సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు బాగ్‌లింగంపల్లి వీఎస్టీ యూనియన్ కార్యాలయంలో జరుగుతుందని గురువారం కమిటీ చైర్మన్ మాస్టర్ దయానంద్ తెలిపారు. ఈ సమావేశంలో మాలల భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున మాల సోదరులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

పదోన్నతుల్లో వికలాంగులకు రిజర్వేషన్లు కల్పించాలి

చిక్కడపల్లి: పదోన్నతుల్లో వికలాంగులకు రిజర్వేషన్లు కల్పించాలని యూబీఐడీఈఎఫ్ రాష్ట్ర ప్రధాన కారదర్శి రాజశేఖర్ డిమాండ్ చేశారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో వికలాంగ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని గురువారం సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వ శాఖ పరిధిలోని వికలాంగుల కమిషనర్ గోవిందరాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన గాంధీనగర్‌లో మాట్లాడుతూ.. యూనియన్ బ్యాంక్‌తో పాటు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో వికలాంగులకు న్యాయం జరగడం లేదన్నారు. తరచూ బదిలీలు చేయకుండా నివాసానికి దగ్గరలో పోస్టింగ్‌లు ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను అమలు చేయడం లేదని వాపోయారు.

బహుభాషా కోవిదుడు ఆదిభట్ల నారాయణదాసు

చిక్కడపల్లి: ఆదిభట్ల నారాయణదాసు బహుభాషా కోవిదుడని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. గురువారం గానసభ నిర్వహణలో హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇనాక్ మాట్లాడుతూ... హరికథ కళా ప్రక్రియకు విశేష ప్రాచుర్యం కల్పించారన్నారు. హరికథ పితామహుడిగా ఖ్యాతిని గడించారని తెలిపారు. ఆయన హరికథ కళాకారుడు మాత్రమే కాదన్నారు. హిందుస్తాని, కర్ణాటక సంగీతంలో ప్రవీణులన్నారు.

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

కాచిగూడ: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి డా. ఎస్.గౌతంరావు ఆరోపించారు. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రజలు నిత్యం అనేక సమస్యలతో సతమతమవుతున్నా వాటిని పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించి కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా నియమితులైన డాక్టర్ ఎస్.గౌతంరావు, కార్యదర్శి ఓ.శ్రీనివాస్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, మహిళామోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మేకల శిల్పారెడ్డిలను కాచిగూడకు చెందిన పార్టీ సీనియర్ నేత ఎక్కాల నందు ఆధ్వర్యంలో కార్యకర్తలు సత్కరించి అభినందించారు.

బీజేపీ విధానాన్ని బహుజనులు తిప్పికొట్టాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సెప్టెంబర్ 17ను తెలంగాణ రాష్ట్రంలో బహుజన శ్రామిక రాజ్యాధికార సాధన దినోత్సవంగా జరపాలని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ పిలుపునిచ్చారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో దండి వెంకట్ మాట్లాడుతూ.. బహుజన శ్రామిక కమ్యూనిస్టు గెరిల్లా యోధుల బలిదానలను హిందూ, ముస్లిం పోరాటంగా చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్న బీజేపీ విధానాన్ని బహుజనులు తిప్పికొట్టాలన్నారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ ఎర్ర జెండా ఆధ్వర్యంలో జరిగిన మహత్తరమైన తెలంగాణ బహుజన శ్రామిక జాతుల స్వయం సాయుధ ప్రతిఘట పోరాటాన్ని తెలంగాణలో బహుజన శ్రామిక రాజ్యాధికార సాధన లక్ష్యంగా ఉద్యమించాలన్నారు.

టీబీ రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలి

ముషీరాబాద్: టీబీ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో కృషి చేయాలని ముషీరాబాద్ టీబీ యూనిట్ సూపర్‌వైజర్ శాంతి అన్నారు. టీబీ ముక్త భారత్ అభియాన్ స్క్రీనింగ్ కార్యక్రమంలో భాగంగా గురువారం బడీ మసీదు వద్ద బైబిల్ హౌస్ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ నిర్ధారణ పరీక్షలు, వ్యాధి పట్ల అవగాహన కల్పించారు. సాధారణ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

కవాడిగూడ: చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ సాధ్యపడుతుందని ఆ దిశగా విద్యార్థులు కృషి చేయాలని జగతి ఫౌండేషన్ సెక్రటరీ రాంచంద్రరావు అన్నారు. గురువారం జగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కవాడిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఉచితంగా షూస్(బూట్లు), బాలికల సౌకర్యార్థం శానిటేషన్ నాప్‌కిన్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.హేమలత, సీహెచ్.సుబ్రమణ్యం, యాకుబ్ జానీ, డాక్టర్.బి.నాగయ్య, ఎస్.అల్లావుద్దీన్, ఎం.ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కంచుకోట అంబర్‌పేట.!

నియోజకవర్గానికి చెందిన ముగ్గురు నేతలకు రాష్ట్ర స్థాయి పార్టీ బాధ్యతలు
ముందు నుంచీ అంబర్‌పేట నేతలకు పార్టీలో కీలక పోస్టులు

అంబర్‌పేట: బీజేపీకి కంచుకోటగా ఉన్న అంబర్‌పేట నియోజకవర్గానికి ఆ పార్టీ అధిష్టానం అధిక ప్రాధాన్యం ఇచ్చింది. విస్తరించిన రాష్ట్ర కార్యవర్గంలో ఇక్కడ నేతలకు సముచిత స్థానం కల్పించింది. రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలను అంబర్‌పేట నాయకులకు కట్టబెట్టింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఎస్.గౌతంరావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా గందమల్ల ఆనంద్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డికి అప్పగించింది. ముందు నుంచి బీజేపీ పార్టీకి పట్టుకొమ్ములుగా అంబర్‌పేట ప్రాంతవాసులు సేవలందిస్తూ వస్తున్నారు. గతంలో ఆలే నరేంద్ర అంబర్‌పేట భాగమైన హిమాయత్‌నగర్ నియోజకవర్గానికి బీజేపీ తరపున ప్రాతినిధ్యం వహించారు.

◆ అనంతరం ప్రస్తుత కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జీ.కిషన్‌రెడ్డి సైతం అంబర్‌పేట ప్రాంతం నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా, మూడు సార్లు రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి ఆ పదవులకు వన్నె తెచ్చారు. అంబర్‌పేట వాసులు బీజేపీ పార్టీ అప్పగించిన బాధ్యతలను పార్టీకి విధేయులుగా ఉంటూ విజయవంతంగా నిర్వహించారు.



◆ ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో పదవులు పొందిన ముగ్గురు సైతం పార్టీ పటిష్టతకు తమదైన శైలీలో ఆహర్నిషలు కృషి చేసిన వారే. వారి సామర్థ్యం, నిబద్ధత ఆధారంగానే పార్టీ వారిని గుర్తించినట్లు పలువురు పరిశీలకులు భావిస్తున్నారు.

ప్రస్తుతం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గౌతంరావు



◆ విద్యార్థి దశ నుంచే ఏబీవీపీలో క్రియశీలంగా డాక్టర్ ఎస్.గౌతంరావు పార్టీకి అనుబంధంగా వివిధ హోదల్లో సేవలందించారు. పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమం విజయవంతం చేయడానికి వెనుకుండి సమర్థమైన సేవలందించారు. అతని సేవలను గుర్తించి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పార్టీ ప్రత్యేక్ష కార్యక్రమాల బాధ్యతను అప్పగించారు. సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు బాధ్యతలు నిర్వర్తించి తనదైన ముద్ర వేశారు. చిన్న సహాయం చేసినా కొండత చెప్పుకునే నేతల స్వభావానికి విరుద్ధంగా ఆయన వ్యవహరించారు. ముక్కుసూటి మనిషిగా వ్యవహారాలను చక్కబెట్టడడంలో గౌతంరావు ముందుటారని పార్టీలో టాక్. జీహెచ్ఎంసీ పరిధిలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ ఆదేశాల మేరకు నిలబడి అందరి దృష్టిని ఆకర్షించారు. తాజగా అతనికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అప్పగించిన బాధ్యతలకు వన్నెతెస్తారని ఆయన సన్నిహితులు వ్యాఖ్యానిస్తున్నారు.

రెండోసారి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా ఆనంద్‌గౌడ్



◆ అంబర్‌పేటకు చెందిన గంధమల్ల ఆనంద్‌గౌడ్ చురకైన నేతగా పార్టీ అతి కొద్ది కాలంలో గుర్తింపు పొందారు. ఇతను కాంగ్రెస్ నుంచి సుమారు 15 ఏళ్ల క్రితం వచ్చిసి బీజేపీ పార్టీ సిద్ధాంతాలను అనుసరించారు. మొదటి దఫా ఓబీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న ఆనంద్‌గౌడ్ రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా ఓబీసీల సమావేశాలు ఏర్పాటు చేసి బీసీ సామాజిక వర్గంలోకి పార్టీని బలంగా తీసుకెళ్లారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో ఓబీసీ కమిటీలు వేసి తనదైన ముద్రవేశారు. అతని చురుకుదనం, నిబద్ధతను చూసి పార్టీ రెండోసారి తిరిగి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్ష బాధ్యతను ఆయనకు అప్పగించింది.

పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి



◆ ఓ శ్రీనివాస్‌రెడ్డి రాష్ట్ర కోశాధికారిగా పార్టీ అభ్యున్నతికి సేవలందించారు. పూర్తి స్థాయిలో పార్టీ వ్యవహారాలను సమర్థవంతంగా చక్కబెట్టడంలో అతడికి గుర్తింపు వచ్చింది. దీంతో విస్తరించిన రాష్ట్ర కార్యవర్గంలో కార్యదర్శిగా పదవి బాధ్యతలను అప్పగించారు.

పీటీసీలో స్మార్ట్ పోలీసింగ్‌పై శిక్షణ

12జిల్లాలకు చెందిన 100మంది పోలీసులకు శిక్షణ పూర్తి: పీటీసీ ప్రిన్సిపల్ మధుకర్‌స్వామి



అంబర్‌పేట: ఆధునిక సాంకేతికతలో నైపుణ్యాన్ని పెంపొందించుకుని పోలీసుల సేవలను మరింత సరళీకృతం చేసేలా పోలీసు శిక్షణ అవసరమని అంబర్‌పేట పీటీసీ ప్రిన్సిపల్ పరవస్తూ మధుకర్ స్వామి తెలిపారు. అంబర్‌పేట పీటీసీలో సైబర్ సెక్యూరిటీ, డ్రోన్ టెక్నాలజీ, సోషల్ మీడియా వినియోగం, ఆర్టిఫీషియల్ ఇంటెలిజన్స్ వంటి అంశాలపై తెలంగాణలోని 12 జిల్లాలకు చెందిన 100 మంది పోలీసులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. గురువారం శిక్షణ ముగింపు కార్యక్రమానికి ప్రిన్సిపల్ హాజరై రోజురోజుకు సమాజంలో జరుగుతున్న విభిన్న నేరాలను ఛేదించేందుకు ఎంతో సాంకేతికత అవసరమని అన్నారు. పౌరులకు స్మార్ట్ పోలీసు సేవలు అందేందుకు పోలీసు సిబ్బంది ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలన్నారు. పీటీసీలో సాధ్యమైనంత వరకు ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా కావాల్సిన అంశాలపై శిక్షణను ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ నిపుణుడు ప్రమీల్ అర్జున్, ట్రైనర్స్ కె.అఖిలేశ్, శ్రీపాదరం, పీటీసీ వైస్ ప్రిన్సిపల్ కేవీ. విజయ్‌కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

యూరియా కొరతకు 'కేంద్ర' విధానాలే కారణం



సుందరయ్య పార్కు వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న టి. సాగర్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమని తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి. సాగర్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరి మారకపోతే సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గురువారం సుందరయ్య పార్కు వద్ద తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పంపిణీ చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించిన కోటా ప్రకారం యూరియాను ఎరువులను సరఫరా చేయలేదన్నారు. సబ్సిడీలో ఎరువుల వాడకం తగ్గిస్తే రాష్ట్రాలకు కూడా వాటా ఇస్తానని కేంద్రం ప్రకటించిందని తెలిపారు. నానో యూరియాను బలవంతంగా అంటగట్టేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

◆ ఉద్దేశపూర్వకంగానే కేంద్రం రైతాంగానికి యూరియా, ఎరువులు అందుబాటులో లేకుండా చేస్తోందని అన్నారు. ఇదే వైఖరి కొనసాగితే శ్రీలంక తరహాలో ఆహార సంక్షోభం వచ్చే ప్రమాదం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా తన విధానాలను మార్చుకోని తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పాలడగు భాస్కర్, ఆర్.వెంకట్‌రాములు, ప్రొ. ప్రసాద్‌రావు, జె.వెంకటేష్, ఎస్.రమ, శ్రీకాంత్, సోమన్న, రాధేశ్యామ్, శోభన్‌నాయక్, పద్మ, కోటా రమేష్, టి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడొద్దు

ముషీరాబాద్: నిరుద్యోగుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటం ఆడొద్దని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గురువారం గ్రూప్-1, జాబ్ కేలండర్‌పై విద్యార్థులు, నిరుద్యోగులు చేపట్టిన నిరసనలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నేతలు అరెస్టు చేసి ముషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ పీఎస్‌కు చేరుకుని నిరుద్యోగులు, విద్యార్థులు, బీఆర్ఎస్ నాయకులను పరామర్శించారు. అరెస్టు అయిన విద్యార్థులు, నిరుద్యోగులు, బీఆర్ఎస్ నేతలను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



ఎమ్మెల్యే ముఠా గోపాల్ పీఎస్‌కు చేరుకుని నిరుద్యోగులు, విద్యార్థులు, బీఆర్ఎస్ నాయకులను పరామర్శించారు.

డ్రగ్స్, గంజాయి నియంత్రణలో ప్రభుత్వం విఫలం

ముషీరాబాద్: డ్రగ్స్, గంజాయి మత్తు పానీయాల నియంత్రణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాకేష్, పెద్దింటి రామకృష్ణ ఆరోపించారు. ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేవం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి విక్రయాలు విచ్చలవిడిగా పెరిగిపోయాయన్నారు. పట్టణ ప్రాంతంలోనే కాదు గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలల చేరువ వరకు వెళ్లాయంటే ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. నగర శివారులోని చర్లపల్లిలో రూ.12వేల కోట్ల డ్రగ్స్ తయారీ కేంద్రం బయటపడడం విస్మయానికి గురి చేసిందన్నారు. ఇది ప్రభుత్వం నిర్లక్ష్యానికి సాక్ష్యమని అన్నారు.

◆ ఇంటెలిజెన్స్ పోలీసులు ఆబ్కారీ శాఖ, ఉన్నత అధికారుల కళ్లుగప్పి రూ.వేల కోట్ల డ్రగ్స్ వ్యాపార సామ్రాజ్యాన్ని నడిపిస్తున్నా కనీసం వాళ్లపై విచారణ చేపట్టకుండా వదిలేశారన్నారు. అంటే డ్రగ్స్ మాఫియాకి లేదా పాలకవర్గాలకు ఉన్నత అధికారులకు ఏమైనా సంబంధాలు ఉన్నాయా..? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా వైన్స్, బార్లకు అనుమతులిస్తోందని అన్నారు. యువత భవిష్యత్‌ని పాడు చేస్తున్న డ్రగ్స్, గంజాయిని నిర్మూలించాల్సిన బాధ్యత ప్రభుత్వం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు భరత్, రవికుమార్, సహాయ కార్యదర్శులు కృష్ణ, రామకృష్ణ, కోశాధికారి నవీన్, రాష్ట్ర నాయకులు ప్రేమ్‌సింగ్, కొల్లూరు భీమేష్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాకేష్, రామకృష్ణ

'నిశ్శబ్ద మాధుర్యం' సంపుటి ఆవిష్కరణ

చిక్కడపల్లి: వంశీ – సినారె విజ్ఞానపీఠం ఆధ్వర్యంలో గుడ్లదొన సాయిచంద్రశేఖర్ రచించిన 'నిశ్శబ్ద మాధుర్యం'కవితా సంపుటి ఆవిష్కరణ గురువారం రాత్రి త్యాగరాయ గానసభలో జరిగింది. తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య ఎన్.గోపి ముఖ్యఅతిథిగా హాజరై సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. సమాజాన్ని చదవకపోతే కవి కలేరన్నారు. ఆవిష్కరించి సంపుటిలోని కవితల్లో వస్తువు సమాజం అని వివరించారు. ప్రముఖ సాహితీ విమర్శకుడు రఘు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వ్యవస్థాపకుడు వంగూరి చిట్టెన్‌రాజు, ప్రముఖులు వంశీ రామరాజు, జి.ఆదినారాయణ, టి.సుధ, ఫణి, జ్యోతిర్లత, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రన్నింగ్ ట్రైన్ ఎక్కుతూ కిందపడి వ్యక్తి మృతి

కాచిగూడ: ఓ వ్యక్తి కాచిగూడ రైల్వే స్టేషన్‌లో రన్నింగ్ ట్రైన్ ఎక్కుతూ ప్రమాదవశాత్తు కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని చికిత్స నిమిత్తం కాచిగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల మేరకు... అనంతపూర్ జిల్లా రుద్రంపేట ప్రాంతానికి చెందిన జోగిఎర్రి స్వామి (41) కాచిగూడ రైల్వే స్టేషన్‌లో బుధవారం రైల్లో సీటు కోసం కదులుతున్న రైలు ఎక్కుతూ ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. అతన్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుని తమ్ముడు మల్లికార్జున్ ఫిర్యాదు మేరకు కాచిగూడ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్లో ఆభరణాల బ్యాగు చోరీ

కాచిగూడ: రైల్లో ప్రయాణికురాలి బ్యాగు చోరీకి గురైన సంఘటనపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... ప్రవీణ్ కుమార్ తన భార్యతో కలిసి కాచిగూడకు రావడానికి ఉజ్జయినీలో రైలు ఎక్కాడు. రైలు ముత్కేడ్ వద్దకు రాగానే చూసుకునే సరికి అతని భార్య బ్యాగు కనిపించలేదు. బ్యాగులో 12 గ్రాముల బంగారు ఆభరణాలు, మొబైల్ చార్జర్, ఆధార్‌కార్డు ఉన్నాయని అన్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు కాచిగూడ రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును నాందేడ్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

అక్రమ నిర్మాణలను ఉపేక్షించేది లేదు

అంబర్‌పేట: అక్రమ నిర్మాణంపై జీహెచ్ఎంసీ సర్కిల్-16 టౌన్‌ప్లానింగ్ అధికారులు కొరడా ఝులిపించారు. అనుమతులకు మించి నిర్మాణం చేపట్టడంతో కూల్చివేశారు. గోల్నాక డివిజన్ శంకర్‌నగర్‌లో ఓ వ్యక్తి రెండు అంతస్తులకు అనుమతులు తీసుకుని మరో రెండు అంతస్తులతో పాటు పెంట హౌస్ నిర్మాణం చేశారు. దీనిపై పలు ఫిర్యాదులు అందుకున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు గురువారం చర్యలకు ఉపక్రమించారు. ఉదయం 7గంటలకు ఏసీపీ కృష్ణకుమారి ఆధ్వర్యంలో అక్రమంగ నిర్మించిన అంతస్తులకు కూల్చివేయించారు. ఎలాంటి ఒత్తిడిలకు స్పందించకుండా పూర్తిస్థాయిలో నిర్మించిన అదనపు రెండు అంతస్తులను నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. అక్రమ నిర్మాణలను ఉపేక్షించేది లేదని చెప్పారు. నోటీసులు జారీ చేసినప్పటికీ కొందరు నిర్మాణదారులు పెడచెవిన పెడుతున్నారని అన్నారు. అలాంటి వారిపై నిర్దాక్షిణ్యంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీఓ సత్యవర్ధన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



గోల్నాకలో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

ఎంఏ గార్డెన్ హాల్ కార్యాలయం సీజ్



హైదర్‌గూడలోని ఎంఏ గార్డెన్ ఫంక్షన్‌హాల్

ముషీరాబాద్: హైదర్‌గూడలోని గగన్‌మహల్ విలేజ్ పరిధిలోని టీఎస్ నం.19 బ్లాక్ ఎల్ వార్డు 54లోని ప్రభుత్వ స్థలంలో రెండు దశాబ్దాలుగా అక్రమంగా కొనసాగుతున్న ఎంఏ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌ను హైదరాబాద్ జిల్లా చేసిన రెవెన్యూ అధికారులు గురువారం సీజ్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి కిషన్‌సింగ్ అనే వ్యక్తి గత 20 సంవత్సరాలుగా 560 గజాల స్థలంలో ఎంఏ గార్డెన్ ఫంక్షన్ హాల్ నిర్వహిస్తున్నాడు. ఈ స్థలంపై ప్రభుత్వానికి అతని మధ్య కోర్టులో వివాదం కొంత కాలంగా కొనసాగుతోంది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు ఆర్డీవో రామకృష్ణ, హిమాయత్‌నగర్ తహసీల్దార్ సంధ్యారాణి పోలీసుల బందోబస్తుతో ఫంక్షన్‌హాల్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ... ఈ స్థలం విలువ రూ.20కోట్లు ఉంటుందని అన్నారు. ఫంక్షన్‌హాల్ సీజ్ సందర్భంగా రెవెన్యూ అధికారులు, ఫంక్షన్ హాల్ యాజమాన్యంతో వాగ్వావాదంతో కొంత ఉద్రిక్తత నెలకొంది.

ఎఫ్‌టీఎల్‌లోని నిర్మాణంపై రెవెన్యూ అధికారుల కొరడా

అంబర్‌పేట: బతుకమ్మకుంటలో ఎఫ్‌టీఎల్ పరిధిలో చేపట్టిన నిర్మాణంపై అంబర్‌పేట రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నారు. తహసీల్దార్ అన్వర్ హుస్సేన్ ఆధ్వర్యంలో గురువారం ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మిస్తున్న ఓ నిర్మాణాన్ని నిలిపివేశారు. బతుకమ్మకుంటకు అనుకుని సుమారు 300 గజాల స్థలంలో కొందరు నిర్మాణం చేపడుతున్నట్లు సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకుని ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణం చేపట్టరాదని నిర్మాణదారులకు నోటీసులు జారీ చేశారు. ఇక్కడ నిర్మాణం చేపడితే చట్టరీత్య చర్యలు ఉంటాయని వారికి తెలిపారు. ప్రాంతం ఎదైనా ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలకు అనుమతులు ఉండవని న్నారు. తహసీల్దార్ వెంట డిప్యూటీ తహసీల్దార్ బల్‌రామ్, ఆర్ఐ భిక్షపతి తదితరులు ఉన్నారు.



బతుకమ్మకుంటలో ఎఫ్‌టీఎల్ పరిధిలో చేపట్టిన నిర్మాణం

మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చొరవ

అంబర్‌పేట: అంబర్‌పేట నియోజకవర్గాన్ని క్లిన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ పేర్కొన్నారు. నియోజకవర్గంలో చెత్త సేకరణ కోసం మంజూరైన 50 రిక్షాలను గురువారం ఆయన అంబర్‌పేటలోని జీహెచ్ఎంసీ స్విమ్మింగ్‌పూల్‌లో ఏఎంహెచ్‌ఓ డాక్టర్ హేమలతతో కలిసి పారిశుద్ధ్య కార్మికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పరిసరాల పరిశుభ్రతతోనే ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. కాలనీలు, బస్తీల్లో చెత్త సేకరించడంలో నిర్లక్ష్యం చేయరాదని ఆయన పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. పారిశుద్ధ్య సిబ్బంది మెరుగ్గా పని చేస్తేనే పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. లేని పక్షంలో తక్షణ ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్య ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. నియోజకవర్గంలో చెత్త నిర్వహణ, తరలింపుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అలాగే ఇప్పటికే నియోజకవర్గంలో పార్కులు, చెట్ల పెంపకంతో పచ్చదనానికి బాటలు వేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏలు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే గోల్నాక డివిజన్‌లో కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ పారిశుద్ధ్య కార్మికులకు చెత్త సేకరణ రిక్షాలను అందజేశారు.



పారిశుద్ధ్య కార్మికులకు స్వచ్ఛ రిక్షాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలను రద్దు చేయాలి

- రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య
- ఏడు నెలల జీతాలు చెల్లించడం లేదు
- ప్రభుత్వం జోక్యం చేసుకుని జీతాలు ఇచ్చేలా చూడాలి



ముషీరాబాద్: ప్రభుత్వ రంగ సంస్థలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, విద్యా రంగ సంస్థలలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల జీతాలు వెంటనే చెల్లించాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ గొల్ల వెంకటేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ సర్వీసెస్, కాంట్రాక్ట్, పర్మనెంట్ అనే వ్యవస్థల్లోని నాలుగింటిలో ఏజెన్సీలను పూర్తిగా రద్దు చేసి పర్మినెంట్, కాంట్రాక్ట్ అనే రెండు వ్యవస్థలను మాత్రమే కొనసాగించాలన్నారు. విద్యా రంగంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఏడు నెలలుగా ఏజెన్సీలు జీతాలు చెల్లించకపోవడంతో వల్ల వారి కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ప్రభుత్వాలు ఏజెన్సీలకు జీతాలు చెల్లించినప్పటికీ కొన్ని ఏజెన్సీలు ఉద్యోగులకు జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాయని తెలిపారు. ఔట్‌సోర్సింగ్‌లో ఏజెన్సీలను రద్దు చేసి ఉద్యోగులకు వారి ఖాతాల్లో వేతనాలు ప్రతి నెల వేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే ఉద్యోగాల భర్తీకి నోటిఫికేసన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు. నాయకులు గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, నంద గోపాల్,రామకృష్ణ, అనంతయ్య పాల్గొన్నారు.

బిర్యానీలో బొద్దింక

- పోలీసులు, అధికారులకు ఫిర్యాదు చేసిన వినియోగదారులు
- అల్ సాద్ ఏ-వన్ రెస్టారెండ్ కిచెన్‌లో ఫుడ్‌సేఫ్టీ తనిఖీలు
- అపరిశుభ్రంగా కిచెన్ ఉండటంపై ఆగ్రహం
- ఫ్రిడ్జ్‌లో నిల్వ ఉంచిన పదార్థాల శాంపిల్స్ సేకరణ



ముషీరాబాద్: గోల్కొండ చౌరస్తా ప్రధాన రహదారిలోని 'అల్ సాద్ ఏ-వన్ అరేబియన్ మండీ రెస్టారెంట్'లో మారేడ్‌పల్లికి చెందిన శ్రీకాంత్, రాఘవాచారిలు బిర్యానీ తింటుండగా అందులో బొద్దింక వచ్చింది. దీంతో బాధితులు జీహెచ్ఎంసీ, స్థానిక ముషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ రామానుజులరెడ్డి ఆదేశాల మేరకు గురువారం ఫుడ్ సేఫ్టీ అధికారులు సాహితీ సిబ్బంది రెస్టారెంట్‌లో తనిఖీలు చూపట్టారు. ఈ హోటల్ కిచెన్ అపరిశుభ్రంగా ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడే ఫ్రిడ్జ్‌లో ఉన్న ఆహార పదార్థాల శాంపిల్స్‌ను సేకరించారు. ఈ సందర్భంగా డీఎంసీ మాట్లాడుతూ.. హోటల్‌లో శుభ్రత పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈగలు, దోమలు, బొద్దింకలు ఇతర క్రిమికీటకాలు వస్తే ఆ హోటల్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇక నుంచి తరచుగా హోటల్స్‌లో తనిఖీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎక్కడైనా నిర్వహణ సరిగా లేకపోతే ప్రజలు నేరుగా తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు.



రెస్టారెంట్‌లో తనిఖీ చేస్తున్న జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు